సాక్షి కామారెడ్డి

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



సమస్యల పరిష్కారానికి కృషి

బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి శని వారం జుక్కల్ మండలంలో పర్యటించారు. వసతి గృహాలను తనిఖీ చేశారు.

- 8లో ▸



పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.7 /22.2

ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి'



కామారెడ్డి క్రైం: స్కూల్ బస్సులను తరచూ తనిఖీ చేయించుకోవాలని జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో స్కూల్ బస్సుల నిర్వహణపై పాఠశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బస్సులకు ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మతులు చేసుకోవాలని, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో ఎంవీఐ జె.శ్రీనివాస్, పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఆర్టీసీ మెకానిక్‌లు, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి రజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరంలో విదేశాల్లో మాస్టర్ డిగ్రీ, పీహెచ్‌డీలాంటి ఉన్నత విద్య అభ్యసించాలనుకునే ఎస్సీ, ఎస్టీ, భూమిలేని వ్యవసాయ కార్మికులు, సంప్రదాయ కళాకారులతో సహా అట్టడుగు వర్గాల వారు అక్టోబర్ 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేవారు జీఆర్ఈ, జీమ్యాట్ లేదా టోఫెల్, ఐఈఎల్‌టీఎస్ అర్హత స్కోర్‌తో పాటు డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం జిల్లా ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలకు నెలాఖరు వరకు గడువు

కామారెడ్డి అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెలాఖరు వరకు గడువుందని కామారెడ్డి స్టడీ సెంటర్ సమన్వయకర్త సుధాకర్ తెలిపారు. వివరాలకు 73829 29695 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కౌలాస్ గేటు ఎత్తివేత



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి శనివారం 530 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 1,105 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీ) కాగా శనివారం సాయంత్రానికి 457.95 మీటర్ల (1.225 టీఎంసీ) నీరు నిల్వ ఉందని తెలిపారు.

24న రేషన్ డీలర్ల 'చలో పటాన్ చెరు'

కామారెడ్డి రూరల్: డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 24న చలో పటాన్ చెరు కార్యక్రమాన్ని చేపట్టినట్లు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్ తెలిపారు. శనివారం ఆయన కామారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కమీషన్‌లను విడుదల చేయాలని, ప్రతి రేషన్ డీలర్‌కు రూ.5వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ. 300 కమీషన్ లేదా రూ.50 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన చలో పటాన్‌చెరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీలర్లను కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గొరిశెట్టి రాజు, ప్రతినిధి నాగం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి.. ఆర్థిక దీప్తి

సండే స్పెషల్

- అండగా నిలుస్తున్న స్వయం సహాయక సంఘాలు
- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్న అతివలు
- స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు



మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. సర్కారు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. బ్యాంకులనుంచి రుణాలు పొంది, స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. తమ కాళ్లపై తాము నిలబడి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న పలువురు మహిళల విజయాలపై 'సాక్షి' సండే స్పెషల్..



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : స్వయం సహాయక సంఘాలు మహిళల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయి. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బాటలు వేశాయి. జిల్లాలో 17,098 స్వయం సహాయక సంఘాల్లో 1.75 లక్షల మంది సభ్యులున్నారు. ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా అందిస్తున్న రుణాలను చాలా మంది సద్వినియోగం చేసుకుంటున్నారు. రుణాలు తీసుకుని సొంతంగా చిరు వ్యాపారాలు ప్రారంభించి క్రమంగా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇంకొందరు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను ఎంచుకుని సక్సెస్ అవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మహిళా శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా 2024–25 సంవత్సరంలో జిల్లాలో 22,007 మంది మహిళలకు రూ.186.42 కోట్ల వడ్డీలేని రుణాలను అందించి సూక్ష్మ తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంతో మరింత మందికి మేలు జరగనుంది.

ఫినాయిల్ తయారీతో ఉపాధి



దోమకొండ మండల కేంద్రానికి చెందిన బుర్రి మహేశ్వరి భర్త స్వామి పదేళ్ల క్రితం చనిపోయారు. దీంతో పిల్లల పోషణ భారం ఆమెపై పడింది. బీడీలు చుట్టగా వచ్చే ఆదాయం ఇద్దరు పిల్లల చదువులకు ఏమాత్రం సరిపోదని భావించిన మహేశ్వరి.. అప్పట్లో దోమకొండ సంస్థానాధీశుడు దివంగత ఉమాపతిరావును కలిసింది. ఆయన ఫినాయిల్ తయారీలో శిక్షణ ఇప్పించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం పొందిన మహేశ్వరి.. సొంతంగా ఫినాయిల్ తయారు చేయడం ఆరంభించింది. అప్పట్లో రూ.80 వేలు దాకా పెట్టుబడి పెట్టింది. అలాగే చాయ్‌పత్తి ముడిసరుకు కొనుగోలు చేసి, చాయ్‌పత్తి తయారు చేసి ప్యాకెట్లుగా చేసి అమ్ముతోంది. రెండు రకాల వ్యాపారాలతో నాలుగు డబ్బులు సంపాదిస్తోంది. చుట్టుపక్కల మండలాలకు వెళ్లి ప్రభుత్వ హాస్టళ్లు, స్కూళ్లకు ఆయా వస్తువులు సరఫరా చేస్తోంది. కూతురు నితీష ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి, ఇంజినీరింగ్ పూర్తి చేసి, సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడింది. ఆమెకు వివాహమైంది. కుమారుడు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నాడు. కష్టాలొచ్చినా భయపడకుండా ఎదురొడ్డి నిలిచి జీవితంలో విజయం సాధించింది మహేశ్వరి.



ఫినాయిల్ తయారు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్న మహేశ్వరి

పుట్టగొడుగుల పెంపకం..



తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామానికి చెందిన విద్యావంతురాలైన చుక్క రాధిక ఇంట్లోనే పుట్టగొడుగుల పెంపకం మొదలుపెట్టింది. భర్త రవీందర్‌గౌడ్ సహకారంతో పుట్టగొడుగులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. పుట్టగొడుగుల పెంపకానికి అవసరమైన యంత్రాలు, సామగ్రికి రూ.2 లక్షలకుపైగా ఖర్చవుతుంది. అయితే రాధిక మాత్రం యంత్రాల సాయం లేకుండానే చిన్నపాటి కటింగ్ ప్లేయర్‌తో పనులు చేసుకుంటోంది. యూట్యూబ్‌లో సెర్చ్ చేసి పుట్టగొడుగుల పెంపకం గురించి తెలుసుకున్నానని, అనంతరం హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుని రూ. 20 వేల పెట్టుబడితో ఇంట్లోనే పుట్టగొడుగుల పెంపకాన్ని ప్రారంభించానని రాధిక చెబుతోంది. ఒక్కసారి వేస్తే మూడుసార్లు పంట వస్తుందని పేర్కొంటోంది.

పచ్చళ్ల వ్యాపారంతో నలుగురికి ఉపాధి..

నస్రుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంపు గ్రామానికి చెందిన అనంతలక్ష్మి పచ్చళ్ల దుకాణంతో నలుగురికి ఉపాధి కల్పిస్తోంది. ఆమె 21 రకాల పచ్చళ్లు తయారు చేస్తారు. మామిడి, ఉసిరి, అల్లం, వెల్లుల్లి, గోంగూర, టమాట, బెల్లం, కాకరకాయ, వంకాయ, కరివేపాకు, కొత్తిమీర, దోసకాయలతోపాటు చికెన్, మటన్, రొయ్యలు, నాటుకోడి పచ్చళ్లు, అరిసెలు, సున్నుండలు, అప్పాలు కూడా తయారు చేస్తారు. విదేశాల్లో ఉన్న వారికి కూడా ఇక్కడి నుంచి పచ్చళ్లు పంపిస్తారు. అనంతలక్ష్మి భర్త వ్యారం చేస్తారు. ఇంటి వద్ద ఖాళీగా ఉండడం ఎందుకన్న ఉద్దేశంతో పచ్చళ్ల తయారీ వ్యాపారం మొదలుపెట్టానని అనంతలక్ష్మి తెలిపారు. నెలకు రెండు క్వింటాళ్ల వరకు పచ్చళ్లు అమ్ముడవుతాయని, అన్ని ఖర్చులు పోనూ రూ. 15 వేల వరకు మిగులుతున్నాయని పేర్కొంటున్నారు.



బంతిపూల సాగు..

భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన ద్యాగల అరుణ బంతిపూల సాగుతో ఉపాధి పొందుతోంది. అరుణ భర్త సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఆమె అత్తమామలతో కలిసి వ్యవసాయ పనులను చూసుకుంటోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా పొందిన రుణాన్ని సద్వినియోగం చేసుకుని బంతిపూల సాగును మొదలుపెట్టింది. రోజూ 20 కిలోల నుంచి 30 కిలోల వరకు బంతిపూలు అమ్ముతున్నారు. కామారెడ్డి, రామాయంపేట తదితర ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. పనులన్నీ ఇంటివాళ్లమే చేసుకుంటామని అరుణ చెబుతోంది. పండుగల సీజన్‌లో ఎక్కువగా అమ్ముడవుతాయని, అప్పుడు ధర కూడా ఎక్కువగా పలుకుతుందని అరుణ పేర్కొంటున్నారు. అన్‌సీజన్‌లో కొంత తక్కువ ఆదాయం లభిస్తోందంటున్నారు.



పిండిగిర్ని, పిండివంటలతో..

నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన యలమంచిలి అరుణమ్మ పదిహేనేళ్లపాటు ప్రైవేటు టీచర్‌గా పనిచేశారు. ఆ తర్వాత పిండిగిర్ని ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. తన భర్త భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటారని, తాను ఇంటివద్దే పిండి గిర్ని నడపడంతో పాటు పిండి వంటలు తయారు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నామని పేర్కొంటున్నారు. ఇద్దరు కూతుళ్లకు వివాహమైందని, ఎవరి బతుకు వారు బతుకుతున్నారని తెలిపారు. అన్ని ఖర్చులుపోనూ నెలకు రూ. 10 వేల వరకు సంపాదిస్తున్నానని అరుణమ్మ చెబుతున్నారు. ఎవరికీ భారం కాకూడదన్న ఉద్దేశంతో ఆరు పదుల వయసులోనూ కష్టపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి



పార్టీ సభ్యత్వం చేయిస్తున్న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

కామారెడ్డి టౌన్: జిల్లాలో రికార్డు స్థాయిలో బీజేపీ సభ్యత్వం నమోదు చేయించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కార్యకర్తలకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని 39వ వార్డులో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను వివరించి సభ్యత్వం నమోదు చేయించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే ఉన్నారన్నారు. రాబోయే అన్ని ఎన్నికల్లో గెలిచేది బీజేపీనే అన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో వ్యాపారులు, సీనియర్ సిటిజన్స్‌తో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాలలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు భరత్, కౌన్సిలర్‌లు శ్రీనివాస్, నరేందర్, నాయకులు వేణు, వీరేశం, సరోజ, అనిత, వెంకట్‌రెడ్డి, రాజగోపాల్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన భోజనం అందించాలి'

ఎల్లారెడ్డి: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టర్ శుక్రవారం రాత్రి ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో రాత్రి బస చేసిన విషయం తెలిసిందే. ఆయన శనివారం ఉదయం గురుకుల విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల భవనం వెనక భాగంలో గేటు ఏర్పాటు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ అధికారికి సూచించారు. పట్టణంలో చేతిపంపులకు మరమ్మతులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. హ్యాండ్ పంప్‌ల రిపేరుకు ఔట్ సోర్సింగ్ విధానంలో సిబ్బందిని తీసుకొని మరమ్మతులు చేయించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు సూచించారు. అనంతరం మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఆయన వెంట ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్ కుమార్ తదితరులున్నారు.



విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మెట్ల బావి పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి రామాలయం ఆవరణలో గల మెట్ల బావిని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం పరిశీలించారు. మెట్లబావి పునరుద్ధరణకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్డీవో మన్నె ప్రభాకర్ తదితరులున్నారు.



మెట్ల బావి పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధమవ్వండి

- విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేయండి
- కాంగ్రెస్ నేతలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలతో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపా దాస్ మున్షీ సమావేశమయ్యారు. ఆ సమావేశం వివరాలను కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావ్ 'సాక్షి'కి వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారిద్దరూ సూచించారన్నారు. నేతల మధ్య విభేదాలు ఉంటే పక్కన పెట్టి పార్టీ కోసం కలిసి కట్టుగా ముందుకు సాగాలన్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆదేశించారన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్ మోహన్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తోట లక్ష్మీ కాంతారావు, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, యూసుఫ్‌అలీ, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారని తెలిపారు.



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో మాట్లాడుతున్న పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్



పీసీసీ ప్రెసిడెంట్‌ను సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావ్, పక్కన షబ్బీర్‌అలీ

నిర్లక్ష్యపు తుప్పు

- ఉపయోగంలోకి రాని అంబులెన్స్
- రూ. 40 లక్షల నిధులు వృథా

కామారెడ్డి టౌన్: బాధితులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చేందుకు ఉద్దేశించిన అంబులెన్స్.. వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా తుప్పుపట్టిపోతోంది. ఉపయోగించకముందే శిథిలావస్థకు చేరుతోంది. రోడ్డు ప్రమాద బాధితులను హుటాహుటిన ఆస్పత్రికి చేర్చి ప్రాణాలను కాపాడాలన్న ఉద్దేశంతో 2013లో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌ను తెప్పించారు. వెంటిలేటర్‌తో కూడిన ఈ అధునాతన అంబులెన్స్ ఖరీదు అప్పట్లోనే రూ. 40 లక్షలు. ట్రామా కేర్ సెంటర్ కోసం దీనిని తీసుకువచ్చారు. అయితే కామారెడ్డిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడంతో దీనిని ఉపయోగంలోకి తేలేదు. దీంతో సుమారు పుష్కర కాలంగా ఈ అంబులెన్స్ మూలన పడి ఉంటోంది. దీనిని వినియోగంలోకి తీసుకురావాలన్న ఆలోచన కూడా చేయకపోవడంతో తుప్పుపట్టి శిథిలమై పోతోంది. జీజీహెచ్ ఆవరణలో పార్కింగ్‌కు స్థలం లేనందున ఈ వాహనాన్ని మెడికల్ కళాశాల వద్దకు తరలించాలని గత కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మూడు నెలలు దాటినా ఇప్పటికీ జీజీహెచ్‌లోనే ఉండడం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి విలువైన అంబులెన్స్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



జీజీహెచ్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్

క్లుప్తంగా

సౌత్‌జోన్ క్రీడల్లో అంకితకు కాంస్య పతకం



కామారెడ్డి అర్బన్ : హైదరాబాద్ ఓయూలో ఈనెల 19, 20 తేదీల్లో నిర్వహించిన సౌత్‌జోన్ విశ్వవిద్యాలయాల జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బీఎస్సీ విద్యార్థి ఎం అంకిత 3వేల మీటర్ల పరుగులో తృతీయ స్థానం సాధించారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ కే విజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ జి శ్రీనివాస్‌రావు అభినందించారు. క్రీడాకారిణి ఎం అంకిత గతంలోనూ క్రీడల్లో ప్రతిభ చూపిందని ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి పీడీలు పేర్కొన్నారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఆకుల సుధాకర్, అకడమిక్ కో–ఆర్డినేటర్ విశ్వప్రసాద్ తదితరులున్నారు.

విద్యావేత్తల సమావేశంలో సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు



భిక్కనూరు : హైదరాబాద్‌లోని ఉస్మానియా యునివర్సిటీలు అఖిల భారత మహిళ విద్యావేత్తల సమ్మేళనంతో తెయూ సౌత్ క్యాంపస్‌కు చెందిన మహిళ అధ్యాపకులు శనివారం పాల్గొన్నారు. మహిళ చట్టాలపై, మహిళల సమస్యలపై ఈ సమ్మేళనంలో చర్చించారు. సమ్మేళనంలో జియో ఇన్‌ఫర్‌మేటిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ కవిత తోరన్, ఫిజిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ లలిత, డాక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



మాచారెడ్డి : కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పిలుపునిచ్చారు. శనివారం మాచారెడ్డిలో నిర్వహించిన 38వ బూత్ కమిటీ కార్యకర్తల సమావేశంలో నిజామాబాద్ శాసన సభ్యులు ధన్‌పాల్ సూర్య నారాయణతో కలిసి పాల్గొన్నారు. బూత్ స్థాయిలో కార్యకర్తల బలమే పార్టీకి వెన్నుముకని కొనియాడారు. ప్రతి బూత్ లో తప్పకుండా 200 మందిని సభ్యత్వం చేయాలని అంతకి మించి చేస్తే ఇంకా మంచిదన్నారు. బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సురేష్, జిల్లా నాయకులు పాన్నాల వెంకటరెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తోట బాల్ రాజు ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నవీన్ నాయక్ తదితరులున్నారు.

కొనసాగుతున్న విచారణ

సదాశివనగర్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు బ్యాటరీలు, కంప్యూటర్‌లు ఎత్తుకెళ్లిన ఘటనలో పోలీసులు విచారణ చేపట్టారు. కార్యాలయంలో పని చేసే సిబ్బందిని విచారించారు. పీఎస్‌కు సమీపంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు పడడం పోలీసులకు సవాలుగా మారింది. కార్యాలయంలోకి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చొరబడినట్లు కనిపించకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. కార్యాలయంలో పని చేసే సిబ్బంది వివరాలను ఆరా తీసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

వసతి గృహాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

- పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి
- బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి
- జుక్కల్‌లో సుడిగాలి పర్యటన



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్(జుక్కల్): బాలికలు, బాలుర వసతి గృహాలతో పాటు పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు క్లోరినేషన్‌పై శ్రద్ధ పెట్టాలన్నారు. శనివారం జుక్కల్ మండల కేంద్రంలోని బాలికలు, బాలుర వసతి గృహాలు, జెడ్పీహైస్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలో సబ్ కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. తాగునీటితో పాటు వంటశాల షెడ్ల నిర్మాణాలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ వసతి గృహం వద్ద విద్యుత్ తీగలతో ఇబ్బందులు ఉన్నాయని వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తీగలను వెంటనే తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆమె ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య చికిత్సలు, మందుల సరఫరాపై రోగులను ఆమె అడిగి తెలుసుకున్నారు. వేడి చేసిన నీటిని చల్లార్చిన తర్వాత తాగాలని రోగులకు ఆమె సూచించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి వెళ్లిన సబ్ కలెక్టర్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట ఎంపీడీవో శ్రీనివాస్, తహశీల్దార్ హిమబిందు తదితరులు ఉన్నారు.

పాఠశాలల బస్సులను తనిఖీ చేయాలి



పట్టణంలో మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాస్



మాచారెడ్డిలో బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

కామారెడ్డి క్రైం :స్కూల్ బస్సులను తరచుగా తనిఖీలు చేసి మరమ్మతులు చేయిస్తే భవిష్యత్తులో సమస్యలకు తావుండదని ఎంవీఐ జె శ్రీనివాస్ పేర్కొన్నారు.స్కూల్ బస్సుల నిర్వహణపై పాఠశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలకు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో శనివారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఎంవీఐ జె శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలల బస్సులను తరచుగా తనిఖీ చేసుకోవాలన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో కూడా క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఆర్టీసీ మెకానిక్ లు, రవాణా శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మాచారెడ్డి : ప్రైవేట్ పాఠశాలల యజమానులు బస్సుల విషయంలో నిబంధనలు పాటించాలని ఎంవీఐ శ్రీనివాస్ సూచించారు. శనివారం మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల బస్సులను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. బస్సులకు సంబంధించిన ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేయించాలన్నారు. ఎప్పటికప్పుడు బ్యాటరీ చెక్ చేసుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్ లేకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం



బాన్సువాడ : బాన్సువాడ మండల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాన్ని శనివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటి బాధ్యులు గణపతి, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. బాన్సువాడ మండల అధ్యక్షుడిగా విఠల్, ప్రధాన కార్యదర్శి సబావత్ లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శంభ్యానాయక్‌ను ఎన్నుకున్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) :సదాశివనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్యా నాయక్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగారెడ్డి, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జైపాల్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్ :రాష్ట్రస్థాయి పదో జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అంత్యంత ప్రతిభ చూపి రెండు బంగారు, రెండు వెండి, మూడు కాంస్య పతకాలు సాధించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్ రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌లు తెలిపారు. 800 మీటర్లు, 1500 మీటర్ల పరుగులో ఎం.ఈశ్వర్‌కు 2 బంగారు పతకాలు, ట్రియతీన్ (ఈత, సైక్లింగ్, పరుగు)లో కే.ప్రవీణ్‌కు బంగారు పతకం, ఎన్.శ్రీనుకు వెండి పతకం, షాట్‌పుట్‌లో పి.గౌతమ్‌కు కాంస్య పతకం, 400 మీటర్ల పరుగులో రాథోడ్ సేవాగ్‌కు కాంస్య పతకం, జావెలిన్‌త్రోలో బి ఈశ్వర్ ప్రసాద్‌కు కాంస్య పతకం వచ్చినట్లు తెలిపారు.

జీటీఏలో సభ్యత్వ నమోదు



బాన్సువాడ : బాన్సువాడ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రభుత్వ టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీటీఏ జిల్లా అధ్యక్షులు ఉల్లెంగ బాల్‌రాజ్ మాట్లాడుతూ బాన్సువాడ, బిచ్కుంద, నిజాంసాగర్, ఎల్లారెడ్డి మండలాల్లో జీటీఏ సభ్యత్వ నమోదు చేస్తున్నామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, కోశాధికారి అనంతరాజు, ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షులు మధుసూదన్ తదితరులు ఉన్నారు.

విద్యాసంస్థల్లో పాముల కలకలం



పాఠశాలలోకి వస్తున్న పాము

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పాము కలకలం రేపింది. ప్రార్థన సమయానికి ముందుగా అటెండర్ మాజీద్ తరగతి గదుల తాళాలు తెరవడంతో విద్యార్థులు తరగతుల్లో బ్యాగులు పెట్టేందుకు వెళ్లారు. ఓ తరగతి గది తలుపులు తెరవగానే పెద్ద పామును అటెండర్‌కు కనిపించింది. అప్రమత్తమైన అటెండర్ మాజీద్, పీఈటీ భూమయ్య విదార్థులను దూరంగా పంపించారు. అనంతరం కర్రతో పామును చంపారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు ఉండటంతో పాములు తరగతి గదుల్లోకి వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని జీపీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు.

తెయూ కంప్యూటర్ సైన్స్ కాలేజ్‌లో ..



ల్యాబ్‌లోకి వచ్చిన పాము

తెయూ(డిచ్‌పల్లి): తెయూ కంప్యూటర్ సైన్స్ కాలేజ్ భవనంలోకి శనివారం రెండు పాములు రావడంతో సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఒక పాము కళాశాల ఆవరణలో తిరుగుతుండగా మరో పాము కంప్యూటర్ ల్యాబ్‌లోకి ప్రవేశించింది. అప్రమత్తమైన సిబ్బంది పాములను చాకచక్యంగా కాలేజ్ బయటకు పంపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాలేజ్ భవనం వెనుక వైపు గుట్ట ఉంది. దీంతో తరచూ కాలేజ్‌కి పాములు, ముంగిసలు వస్తుంటాయని సిబ్బంది తెలిపారు.

పిడుగుపడి పాడిగేదె మృతి

బాన్సువాడ రూరల్: మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కోనాపూర్ గ్రామంలో కుమ్మరి సంగయ్యకు చెందిన పాడిగేదె పిడుగుపాటుకు గురై మృతి చెందింది. గేదె విలువ రూ.50వేలు ఉంటుందని, ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని రైతు కోరారు. తాడ్కోల్ శివారులో రహదారిపై ఈదురు గాలులకు ఓ చెట్టు రోడ్డుపై కూలింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో గ్రామ మాజీ సర్పంచ్ కుమ్మరి రాజమణి రాజు స్పందించి జేసీబీతో చెట్టును పక్కకు తప్పించారు.

నాగన్నగారి బావికి పర్యాటక శోభ



నాగన్నగారి బావి

లింగంపేట: మండల కేంద్రంలోని చారిత్రక ప్రాధాన్యతగల నాగన్నగారి మెట్ల బావి పూర్వవైభవాన్ని సంతరించుకుంటోంది. స్వచ్ఛంద సంస్థలు, అధికారుల రెండేళ్ల శ్రమ ఫలించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతోంది. శిథిలావస్థకు చేరుకున్న పురాతన కట్టడాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బావి చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



బీబీపేట ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్

బీబీపేట : పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని టీఎస్‌ఎస్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం సరిగ్గా ఇవ్వడం లేదని తల్లిదండ్రులు, విద్యార్థులు తెలపడంతో ఆ మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేశారు. నూతనంగా మళ్లీ ఏజెన్సీని నియమించుకునేందుకు వచ్చే నెల 15వ తేదీ వరకు సమయమిచ్చారు. తహసీల్దార్ సత్యనారాయణ, కార్యదర్శి రమేష్, హెచ్‌ఎం రవీంద్రరెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లను అందజేస్తున్న సిబ్బంది

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి పట్టణంతో పాటు, మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం మహాలక్ష్మి పథకానికి సంబంధించిన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రేషన్‌డీలర్లు, మెప్మా సిబ్బంది, ఐకేపీ సీఏల ఆధ్వర్యంలో అర్హులైన వారికి ఈ సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్నారు. అయితే గ్యాస్ సబ్సిడీ వచ్చిన వారికి మాత్రమే ఈ సర్టిఫికెట్లు అందజేస్తున్నారని రాని వారికి పంపిణీ చేయకపోవడంతో గ్యాస్ సబ్సిడీ రాని వారు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ సబ్సిడీ రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని వారు పేర్కొంటున్నారు.

సంక్షేమ పథకాల గురించి వివరించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : రాష్ట్రంలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని చీనూర్, వాడి, గోపాల్‌పేట గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు లక్ష్మణ్, సుధాకర్, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య తదితరులున్నారు.

28 నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలను ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు రాంచందర్ తెలిపారు. పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ రాజీవ్‌గాంధీ శనివారం ఆవిష్కరించారు. సీనియర్ ఏ.బీ.సీ 5వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీలను నగరంలోని శివాజీనగర్ మున్నూరుకాపు కళ్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. రాష్ట్రసీనియర్ కాంపిటీషన్ డైరెక్టర్ రాంరెడ్డి జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి టి బాలశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి సంగీత, హెచ్ శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మద్యం మత్తులో కిందపడి సొసైటీ డైరెక్టర్ మృతి



లింబాద్రి మృతదేహం

బాల్కొండ: మద్యం మత్తులో సొసైటీ డైరెక్టర్ కిందపడి మృతిచెందిన ఘటన బాల్కొండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. నాగాపూర్ గ్రామానికి చెందిన బాల్కొండ సహకార సంఘం డైరెక్టర్ గురికాడి లింబాద్రి(50) శుక్రవారం రాత్రి మండల శివారులోని ఓ ఫాం హౌస్‌లో సహ డైరెక్టర్లతో కలిసి విందు చేసుకున్నారు. మద్యం మత్తులో ఉన్న లింబాద్రి ఇంటికి వెళ్తానని బైక్ వద్దకు వచ్చి కిందపడ్డాడు. ఈ ఘటనలో బైక్ అతనిపై పడడంతో తల, కన్నుపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ తండా వద్ద ఉన్న జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని భీమ్‌గల్ మండలం సుదర్శన్‌నగర్ తండాకు చెందిన భూక్య సీతారాం(60) మృతి చెందాడు. జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. భూక్య సీతారాం మదన్‌పల్లి తండాలో ఉన్న తన కుమార్తె వద్దకు మోటార్‌సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా పడకల్ తండా వద్ద జాతీయ రహదారిపై యూటర్న్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాంధారిలో చోరీ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

గాంధారి: మండల కేంద్రంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. గాంధారి మండల కేంద్రానికి చెందిన కుమ్మరి రంజిత్ తన కుటుంబీకులతో కలిసి గురువారం వేములవాడకు వెళ్లారు. దుండగులు ఇంటికి తాళం ఉండడంతో చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చిన రంజిత్ ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సంతోష్, ఎస్సై ఆంజనేయులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాక్లూర్ మండలంలోని బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగి గడీల సతీశ్ కుమార్‌కు గాయాలైనట్లు ఎస్సై వినయ్ శనివారం తెలిపారు. నిజామాబాద్ నుంచి నవీపేట వైపు బైక్‌పై సతీశ్‌కుమార్ వస్తుండగా ముందు వెళ్తున్న ఆటో ఒక్కసారిగా రోడ్డుపై ఆపడంతో వెనుక ఉన్న సతీశ్ కుమార్‌కు ఆటో తగిలి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి తమ్ముడు నితీశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: పొతంగల్ మండలం సోంపూర్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు, రెవెన్యూ అధికారులు శనివారం పట్టుకున్నారు. ట్రాక్టర్లను కోటగిరి పీఎస్‌కు తరలించారు. మంజీర నది నుంచి రాత్రి వేళ అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు నిఘా ఉంచగా మూడు ట్రాక్టర్లు పట్టుబడినట్లు తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాలు, వాటి యాజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సీజ్ చేసిన వాహనాలను ట్రాన్స్‌పోర్టు, మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని, బాధ్యులను బైండోవర్ చేస్తామని పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్: కోటగిరి మండలం లింగాపూర్ శివారులో పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా తొమ్మిది మంది పట్టుబడ్డారు. వీరి నుంచి రూ. 46,060 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

అప్పుల బాధతో వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య



అల్లె వినోద్ (ఫైల్)

నవీపేట: మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన అల్లె వినోద్ కుమార్(30) అప్పుల బాధతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయారెడ్డి శనివారం తెలిపారు. దుబాయికు వెళ్లేందుకు అప్పుచేసి వీసా పొందిన వినోద్ మెడికల్ టెస్టులకు వెళ్లాడని పేర్కొన్నారు. ఫిట్‌నెస్‌లో ఫెయిల్ అవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడని, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తితో శనివారం వేకువజామున గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై పేర్కొన్నారు.

కుమార్తె వివాహం కోసం..



సాయిబాబు(ఫైల్)

బాల్కొండ: కుమార్తె వివాహం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బాల్కొండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండల కేంద్రంలోని పోచమ్మగల్లీకి చెందిన జెట్టి సాయిబాబు(48) తన కుమార్తె వివాహం కోసం అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడుతుండేవాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంట్లో ఉన్న వారిని బయటకు పంపించాడు. కొద్దిసేపటికి అనుమానం వచ్చిన కుటుంబీకులకు తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు..



రాధాకృష్ణ (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని గొల్లపల్లికి చెందిన తేలు రాధాకృష్ణ (32) మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. ఎసై తెలిపిన వివరాల ప్రకారం.. రాధాకృష్ణ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం తెల్లవారు జామున భార్యా, పిల్లలు పడుకున్న గదికి బయట గొళ్లెం పెట్టి మరో గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిందితుల రిమాండ్



మాట్లాడుతున్న ఎస్సై నరేశ్

రామారెడ్డి: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్ శనివారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో వ్యవసాయ పొలాల్లో అదే గ్రామానికి చెందిన పల్లెపు రాజు, సుద్దాల సంతోష్ వ్యవసాయ పరికరాలు, పురుగుల మందు చల్లే మిషన్లు, ఇతర పరికరాలను చోరీలకు పాల్పడేవారు. ఈ క్రమంలో చోరీలకు పాల్పడుతున్న వీరిని గ్రామస్తుల సహకారంతో పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితుల నుంచి వ్యవసాయ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.